సహకార సంస్థల ఆర్థిక బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర, సహకార శాఖ ఆదేశాలకు అనుగుణంగా సహకార సంస్థల ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తామని స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టి.శ్రీనివాస్ అన్నారు. సభ్యుల భాగస్వామ్యాన్ని పెంచడానికి రాష్ట్రస్థాయిలో, అదే విధంగా జిల్లాస్థాయిలో అవగాహన సదస్సుల ఏర్పాటుకు జిల్లా సందర్శనలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్వహించే అవగాహన సదస్సుల గురించి వివరించారు. వీటిని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన జిల్లా కలెక్టర్‌ని కోరారు. సహకార సంస్థల ఆర్థిక బలోపేతానికి సభ్యుల భాగస్వామ్యాన్ని పెంచడానికి జిల్లాస్థాయిలో అవగాహన సదస్సుల నిర్వహణకు అవసరమైన సహకారం అందిస్తామని, ఆ మేరకు జిల్లా సహకార అధికారికి కలెక్టర్ తగు ఆదేశాలిచ్చారు.

కుక్కునూరులో స్వాగతం పలుకుతున్న మహిళలు

వేలేరుపాడులో వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

బుట్టాయగూడెంలో యాత్రకు ఘనస్వాగతం

హారతులిచ్చి.. తిలకం దిద్ది

ఏజెన్సీలో ప్రజారక్షణ భేరి బస్సు యాత్రకు ఘన స్వాగతం

ఎదురెళ్లి స్వాగతం పలికిన మహిళలు, గిరిజనులు

నిర్వాసితుల, ఏజెన్సీ సమస్యలపై గళమెత్తిన నేతలు

జీలుగుమిల్లిలో ఆయుధ కర్మాగారం ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టతివ్వాలి

పునరావాస కాలనీల్లో వసతుల లేమిపై మండిపాటు

ప్రజాసమస్యలపై వినతుల వెల్లువ

జిల్లాలో తొలిరోజు కుక్కునూరు నుంచి కొయ్యలగూడెం వరకూ సాగిన సిపిఎం బస్సు యాత్ర

జీలుగుమిల్లిలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు బి.వెంకట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/ కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం జీలుగుమిల్లి/ బుట్టాయగూడెం

సిపిఎం చేపట్టిన ప్రజారక్షణభేరి బస్సుయాత్రకు సోమవారం తొలిరోజు జిల్లాలో ఘనస్వాగతం లభించింది. ఉదయం తొమ్మిది గంటలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో కుక్కునూరులో ప్రారంభమైన బస్సు యాత్ర వేలేరుపాడు, జీలుగుమిల్లి, రెడ్డిగణపవరం, రామారావుపేట, బుట్టాయగూడెం, కన్నాపురం, పోలవరం మీదుగా కొయ్యలగూడెం వరకూ సాగింది. యాత్ర బృందానికి జనం ఎదురేగి స్వాగతం పలకడమే కాకుండా మహిళలు హారతులిచ్చి, తిలకం దిద్ది ఆహ్వానించారు. గిరిజన నృత్యాలతో సభావేదిక వద్దకు నాయకులను తోడ్కొని వెళ్లారు. యాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సురేంద్ర, వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు, అశోక్, రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగమణి, డిఎన్‌విడి.ప్రసాద్, తెల్లం రామకృష్ణ, జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ప్రతి మండల కేంద్రంలో సభ నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు. కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పలు సభల్లో మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టారు. నిర్వాసితుల సమస్యలపై పాదయాత్ర చేపట్టి దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా చేసిన పార్టీ సిపిఎం ఒక్కటేనన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు వైసిపి, టిడిపి, జనసేనలు కేంద్రంలోని బిజెపికి దాసోహమయ్యాయని విమర్శించారు. జీలుగుమిల్లిలో ఏర్పాటు చేయ తలపెట్టిన ఆయుధ కర్మాగారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నాణ్యత, అవినీతిపై న్యాయవిచారణ చేపట్టి దోషులను శిక్షించాలని కోరారు. బుట్టాయగూడెం సభలో వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒకరు మరోసారి సిఎం పదవి కావాలని, మరొకరు ఇంకోసారి అవకాశం ఇవ్వాలని ముందుకొస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నూరుశాతం హామీలు అమలు చేశామని జగన్ చెబుతున్నారని, అలా అయితే కరువు పరిస్థితులు ఎందుకొచ్చాయని, స్కీమ్ వర్కర్లు జీతాల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎందుకొచ్చాయని ప్రశ్నించారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాహనం ఎక్కితే శరీరం గుల్లవుతుందన్నారు. పోలవరం ఎంఎల్ఎ నియోజకవర్గంలో రోడ్లు వేయలేకపోవడమేకాక, తాగునీరు కూడా ఇవ్వలేదన్నారు. నిర్వాసితుల కాలనీల్లో తాగునీరు, ఆసుపత్రులు వంటి సదుపాయాలేవీ లేవన్నారు. ఈ ప్రభుత్వం ఇసుక దొంగలకు, భూస్వాములకు, కాంట్రాక్టర్లకు అండగా నిలిచిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలు, ఆశాల జీతాలు పెంచలేదన్నారు. పేదలకు అండగా ఉండేది సిపిఎం మాత్రమేనని, ప్రజలను చైతన్యపర్చేందుకే బస్సుయాత్ర చేపట్టామన్నారు. బిజెపి రాష్ట్రానికి ద్రోహం చేసిందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నోరు మెదపడం లేదన్నారు. సిపిఎం తరపున ఐదుగురు ఎంఎల్ఎలు గెలిచినా పేదల పక్షాన ధీటుగా పోరాడుతుందన్నారు. వేలేరుపాడు సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను ఎండగట్టారు. కుక్కునూరు సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ నిర్వాసితుల పునరావాసానికి సంబంధించి తమకు సంబంధం లేదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రోజుకోమాట మాట్లాడుతుందన్నారు. ముంపు మండలాల్లో అభివృద్ధిని కొనసాగించాలన్నారు. ఉపాధి హామీ పనులకు ఏడాదికి రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించి నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. కుక్కునూరు సభకు మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు, వేలేరుపాడు సభకు మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జీలుగుమిల్లిలో సభకు మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, బుట్టాయగూడెం సభకు మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలవరంలో సభకు మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సభలకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు, ప్రజలు పెద్దఎత్తున తరలొచ్చారు.

మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

పోలవరంలో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

నారాయణ కళాశాల బస్సు బోల్తా

17 మందికి గాయాలు - అతివేగమే కారణం..!

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నారాయణ విద్యాసంస్థల బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో సుమారు 17 మంది విద్యార్థులు గాయాలపాలైన ఘటన పెదవేగి మండలం చొదిమెళ్ల సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బస్సులోని విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రూరల్ మండలం, పెదవేగి మండలాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఏలూరు నగరంలోని నారాయణ కళాశాలలో చదువుతున్నారు. సోమవారం వీరంతా యథావిధిగా కళాశాలకు బస్సులో వెళ్లారు. కళాశాల ముగిసిన అనంతరం వీరంతా కళాశాల బస్సులో ఇళ్లకు బయలుదేరారు. చొదిమెళ్ల సమీపంలో కొందరు విద్యార్థులను దింపిన తర్వాత వంగూరు బయలుదేరింది. చొదిమెళ్ల శివారులోని ఓ మలుపు వద్ద బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సమయంలో బస్సులో సుమారు 43 మంది విద్యార్థులున్నారు. ఈ ఘటనలో 15 మంది విద్యార్థులు గాయపడ్డారు. దీంతో విద్యార్థులంతా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే బస్సు వద్దకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. 108 అంబులెన్సు సకాలంలో చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి మెరుగ్గా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు గాయపడిన విద్యార్థులను దెందులూరు ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి, జనసేన దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఘంటసాల వెంకటలక్ష్మి, దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, జిల్లా అధికారులు పరామర్శించి ప్రమాద ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గాయపడిన విద్యార్థులు

రోడ్డుపై బోల్తాపడిన బస్సు

అతివేగమే కారణం

అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ప్రమాదకర మలుపువద్ద కూడా డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా నడిపాడని స్థానికులు తెలిపారు. డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బంధువుల ఆందోళన

విద్యార్థుల తల్లిదండ్రులు ప్రమాద సమాచారాన్ని తెలుసుకుని హడావుడిగా ఘటనాస్థలానికి చేరుకున్నారు. పిల్లల యోగక్షేమాలపై కంగాపడ్డారు. సురక్షితంగా ఉన్న పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు : ఎంఎల్ఎ

గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నామని ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి తెలిపారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గాయపడిన ప్రతీవిద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపించే విధంగా డిఎంహెచ్‌ఒకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే ఆసుపత్రివర్గాలు అనునిత్యం వారి ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించేందుకు కూడా చర్యలు చేపట్టాలని సూచించామని తెలిపారు. బస్సు ప్రమాదానికి కారణమైన వారిని ఉపేక్షించేది లేదని, ఒకవేళ బస్సు ఫిట్‌నెస్ లేకపోతే బస్సు నడిపే కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సాంకేతిక లోపం వల్లే బస్సు ప్రమాదానికి గురైందని ఆయన తెలిపారు. మొత్తం 17 మంది విద్యార్థులు గాయపడ్డారని, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయన్నారు. వారిలో ఒకరిని ఏలూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు.

వినతులు స్వీకరిస్తున్న జెసి లావణ్యవేణి

స్పందన అర్జీలకు సంతృప్తికర పరిష్కారం : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అందిన అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో జెసి లావణ్యవేణి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులను సావధానంగా విని అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆయాశాఖల అధికారులకు జెసి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలసంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు, పేదలందరికి ఇళ్లు, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, భూ వివాదాలు తదితర సమస్యలకు సంబంధించి మొత్తం 253 అర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు. ఒకే అంశంపై మళ్లీ మళ్లీ అర్జీలు నమోదు కాకుండా అధికారులు దృష్టిపెట్టి వినతులను పరిశీలించి న్యాయమైన పరిష్కారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

22 నుంచి అభినయ నృత్యభారతి వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ నృత్య సంస్థ అభినయ నృత్యభారతి 28వ వార్షికోత్సవం వచ్చేనెల 22, 23, 24 తేదీల్లో స్థానిక వైఎంహెచ్ఎ హాల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షులు అంబికా కృష్ణ, వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ గోపాల్ లునాని, నాట్యాచార్య లయన్ దువ్వి హేమసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వానసంఘ కరపత్రాన్ని సోమవారం వైఎంహెచ్ఎ హాలులో విడుదల చేశారు. లయన్స్ జిల్లా 316జి, హేలాపురి లయన్స్ క్లబ్, సర్వీస్ ట్రస్ట్, నెహ్రూ యువకేంద్రం, హిందూ యువజన సంఘం, వివిధ కళా సంస్థలు, సేవా సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సుమారు పది రాష్ట్రాల నుండి వివిధ శాస్త్రీయ సాంప్రదాయ రీతులకు చెందిన 20 మంది యువ నృత్య కళాకారులను ఆహ్వానించి ప్రదర్శనలు ఏర్పాటు చేసి 'నృత్య కౌముది - 2023' అవార్డులతో సత్కరించనున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని సేవా తపస్వి, నృత్య రంగంలో కృషి చేస్తున్న వారికి నృత్య తపస్వి అవార్డుతో సత్కరించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళారత్న కెవి.సత్యనారాయణ, యర్రా సోమలింగేశ్వరరావు, వేణుగోపాల్ లునాని, కానాల రమేష్ పాల్గొన్నారు.

ఆంధ్ర కాలువ అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి - చింతలపూడి

ఆంధ్ర కాలువ అభివృద్ధికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ చొరవతో రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నిధులు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారని ఎంపిపి రాంబాబు తెలిపారు. వర్షాభావంతో వరిపంట నష్టపోయిన రైతులకు బీమా అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టి.నరసాపురం సొసైటీ సిఇఒ అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సిఇఒగా పనిచేసిన టి.కిషోర్‌కుమార్ సొసైటీకి చెందిన నిధులను అతని కుటుంబ సభ్యుల పేరున బదలాయించుకున్నట్లు వచ్చిన అభియోగంపై నమోదైన కేసులో అరెస్టు చేసినట్లు జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం అరెస్టు చేసి చింతలపూడి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

న్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలి

జిల్లాలో పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చారిత్రాత్మకమైన ఢిల్లీ రైతాంగ పోరాటానికి వ్యతిరేకంగా న్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్‌లో నిరాధారమైన, నిజాయితీ లేని తప్పుడు ఆరోపణలను ఖండిస్తూ, బిజెపి ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ, ఎపి రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం న్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడారు. న్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం ఢిల్లీ రైతు ఉద్యమంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమానికి విదేశీ నిధులు వచ్చాయని చెప్పడం దారుణమన్నారు. ఢిల్లీ ఉద్యమం సందర్భంగా ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వెయ్యి రోజులుగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటానికి జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.జగన్నాథం, వి.సాయిబాబు, పి.కిషోర్, మావూరి శ్రీనివాస్, శ్యామలారాణి, కిసాన్ కాంగ్రెస్ నాయకులు దండుబోయిన చంద్రశేఖర్, గౌడు రంగబాబు, ఎఐటియుసి జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, కడుపు కన్నయ్య, బికెఎంయు నాయకులు పొట్టేలు పెంటయ్య, బుగ్గల ప్రభాకర్ పాల్గొన్నారు.

పోలవరం : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన న్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ న్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం నాయకులు బోరగం భూ చంద్రరావు, జి.వెంకట్రావు, మడివి చలపతిరావు, సముద్రాల సాయికృష్ణ, మిడియం గంగాదేవి పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు సూర్యకుమార్, ఎఐటియుసి ఏరియా అధ్యక్షులు తొర్లపాటి బాబు, ఎఐకెఎస్ జిల్లా అధ్యక్షులు డి.రంగనాథ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కె.వీరబాబు, రమేష్, అప్పారావు, ప్రసాద్, సిఐటియు నాయకులు నత్త వెంకటేశ్వరావు, బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణ, జనవిజ్ఞాన వేదిక నాయకులు పి.పాండురంగారావు పాల్గొన్నారు.

ఏలూరులో ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేస్తున్న నాయకులు

కొనసాగుతున్న ఇవిఎంల తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 16 నుంచి ప్రారంభించిన ఇవిఎంలు, వివి ప్యాట్స్ ఫస్ట్ లెవెల్ చెకింగ్ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగుతున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో వివి ప్యాట్స్ గొడౌన్‌లో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ముందుగా సిబ్బంది హాజరు, సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది హాజరుపట్టికను కూడా పరిశీలించారు. అలాగే గొడౌన్ పరిసరాలు పరిశుభ్రతతో ఉండాలని ఎన్నికలు సెక్షన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రక్రియ ఈనెల పదో తేదీ వరకూ నిరంతరాయంగా జరుగుతుందన్నారు.

ఇవిఎంల చెకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

15 నుంచి ఆరోగ్యశ్రీపై ప్రచారం

ఏలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రాధాన్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం తాడేపల్లి నుండి జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్యక్రమాలపై సిఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఏలూరు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, డిఎంహెచ్ఒ ఎస్.షర్మిష్ట, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిసిహెచ్ఎస్ పాల్ సతీష్, హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జగన్ అందించిన మార్గదర్శకాల మేరకు సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ పలుసూచనలు జారీ చేశారు. జనవరి నుండి నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి సంబంధించి వైద్య ఆరోగ్యశాఖాధికారులు సంబంధిత డేటాను అప్ డేట్ చేసుకోవాలన్నారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకూ ఆరోగ్యశ్రీపై అవగాహనకు ప్రచారం నిర్వహించి ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలన్న దానిపై ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరి ఫోన్‌లో ఆరోగ్య యాప్ ఉండేలా చూడాలన్నారు. ఆరోగ్య శ్రీ చికిత్స కోసం ఎక్కడకు వెళ్లాలన్నదానిపై పూర్తి వివరాలు ఈ యాప్‌లో ఉంటాయి. దీనిపై ఎలాంటి సందేహాలు ఎవ్వరికీ ఉండకూడదని సూచించారు.

ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు గౌరవ మర్యాదలతో నడుచుకోవాలని ఎస్‌పి మేరీప్రశాంతి సూచించారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఎస్‌పి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులపై ఆమె స్పందించి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో సంభాషించి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని ఆమె స్పష్టం చేశారు. దీపావళి పండుగ నేపథ్యంలో అక్రమంగా బాణసంచా నిలువ ఉంచినా, అమ్మకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి

'మధ్యాహ్న భోజనం'లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలని మున్సిపల్ ఛైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి సూచించారు. సోమవారం స్థానిక జెడ్పిహెచ్ బాలుర పాఠశాలను ఆమె సందర్శించారు. గ్రీన్ రైస్, ఉడికించిన కోడి గుడ్లును పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికల అచ్యుతరామయ్య, వైసిపి సీనియర్ నాయకులు బత్తిన చిన్నా పాల్గొన్నారు.

టైలర్‌కు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని గుణ్ణంపల్లి గ్రామంలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న టైలర్ యడ్లపల్లి నటరాజ్(ప్రజా టైలర్స్)కు ద్వారకాతిరుమల టైలర్ సంఘం ఆర్థిక సహాయం అందించారు. కిడ్నీ, లివర్ కంప్లైంట్, మూత్రం నుంచి రక్తస్రావం ఇబ్బందితో వాటితో బాధపడుతున్న విషయం తెలుసుకుని సంఘం నిధుల్లో ఆర్థిక సహాయం రూ.12,320 అందజేశారు. ఆపదలో ఉన్న టైలర్ను ఆదుకోవడానికి టైలర్స్ గ్రూపు ఎప్పుడు ముందుంటుందని టైలర్ నేటూరి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ సయ్యద్ సలీం, షేక్ పెటు సోహెల్, గుడివాడ అంజలీదేవి, కండవల్లి దివ్యవాణి, ఎస్పి రాము, తమ్మిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో టిడిపిదే విజయం'

చింతలపూడి : 2024లో టిడిపి అధికారంలోకి వస్తుందని టిడిపి చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని ప్రగఢవరంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పనిచేయాలన్నారు. అనంతరం గడపగడపకూ తిరుగుతూ భవిష్యత్‌కు గ్యారెంటీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బుద్దాల నాగు, మాజీ ఎంపిటిసి రాజా, వార్డు మెంబరు నల్లగోపు కృష్ణమూర్తి, మానేపల్లి రాజారావు, కొమ్ము తిరుపతిరావు, కొప్పెర్ల నాగరాజు, మారేష్ పాల్గొన్నారు.

8న జిల్లాస్థాయి యోగా పోటీలు

ఏలూరు అర్బన్ : యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనుబంధ సంస్థ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఏలూరులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ కళ్యాణ మండపం, పెరుగు చెట్టు సెంటర్ వద్ద ఉదయం 8 గంటల నుంచి జిల్లాస్థాయి యోగాసనా పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు, కార్యదర్శి సిహెచ్.శివ ఒక ప్రకటనలో తెలిపారు. 9 నుంచి 14 సంవత్సరముల వరకు సబ్ జూనియర్ కేటగిరి, 14 నుంచి 18 సంవత్సరముల వరకు జూనియర్ కేటగిరి, 18 నుంచి 28 సంవత్సరముల వరకు సీనియర్ కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. అలాగే మాస్టర్ కేటగిరిలో సీనియర్ 28–35, 36–45, 46–55 విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. పారా యోగాసన పోటీలు కూడా వివిధ విభాగాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో సెలెక్ట్ అయిన వారు రాష్ట్రస్థాయి లోను, తరువాత జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కూడా పొందగలరని, ఆసక్తి ఉన్నవారు అసోసియేషన్ సభ్యులను సంప్రదించాలని వారు తెలిపారు.

డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా

ఆగిరిపల్లి : డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఆగిరిపల్లి కెడిసిసి బ్యాంక్, బ్రాంచి మేనేజర్ కె.మరియమ్మ తెలిపారు. సోమవారం నాబార్డు సౌజన్యంతో సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డు, రూపే కార్డు, డెబిట్ కార్డుల వినియోగం, నగదు రహిత లావాదేవీలపై కళాజాత నిర్వహించారు. కళాజాత కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పలు పిఎసిఎస్‌ల అధ్యక్షులు, సిఇఒలు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరంలో మతిస్తిమితంలేని వ్యక్తి రైలు పట్టాలు దాటుతూ రైలు ఢీకొని మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని చిట్టివలస పాకల ప్రాంతానికి చెందిన బోశెట్టి బుచ్చి రామయ్య(58)కు గత కొంతకాలంగా మతిస్తిమితం సరిగా లేదు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి చిట్టివలస పక్కల సమీపంలో ఉన్న రైలు పట్టాలు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని రైలు బండి అతన్ని ఢీ కొనడంతో, అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై రైల్వే ఎస్ఐ నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తెలంగాణా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని తాటియాకులగూడెం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణా నుంచి నుపా రాజేష్ అనే వ్యక్తి తన వద్ద ఉన్న సంచిలో 10 మద్యం బాటిళ్లతో నడుచుకుంటూ వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

ప్రజాశక్తి - చింతలపూడి

'జగనన్న సురక్ష' పేదలకు వరమని చింతలపూడి వైసిపి నగర పంచాయతీ అధ్యక్షులు కొప్పుల నాగు తెలిపారు. నగర పంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు ఆధ్వర్యంలో బోయగూడెం సచివాలయం పరిధిలో చింతలపూడి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత పరీక్షలు, వైద్యంతో పాటు మందులు కూడా ఇస్తున్నారని, అందరూ ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ స్టాల్ పరిశీలించారు. మండల సిడిపిఒ మాధవి పోష్టికాహారం, బాలామృతం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిటీ మెడికల్ దుర్గారావు, త్సల్లాబత్తుల శ్రీను, రాజ్ ప్రకాష్, గంధం చంటి, ఆత్కూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మెడికల్ కిట్‌ను అందిస్తున్న కమిషనర్ రాంబాబు

'ప్రజారక్షణ భేరి'ని జయప్రదం చేయాలి : సిపిఎం

ఏలూరు అర్బన్ : రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర మంగళవారం ఏలూరు వస్తుందని, ఈ సందర్భంగా జరుగుతున్న ర్యాలీ, బహిరంగ సభలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ కోరారు. సోమవారం ఉదయం పవర్‌పేట సిపిఎం కార్యాలయంలో నగర కమిటీ సమావేశం బి.సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కిషోర్ మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఒక ప్రణాళిక రూపొందించిందని, దానిపై రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ యాత్రలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు నేతృత్వం వహిస్తున్నారని, ఈ బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం ఏలూరు వస్తుందన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఖండ్రిక గూడెం పంచాయతీ ఆఫీస్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తామని, తంగేళ్లమూడి వంతెన, ఆదివారపు పేట, గన్ బజార్, పవర్ పేట రైల్వే స్టేషన్ మీదుగా ఆర్ఆర్ పేట పార్కు వరకూ ర్యాలీ కొనసాగుతుందన్నారు. అనంతరం అక్కడే బహిరంగసభ జరుగుతుందన్నారు. 7వ తేదీ రాత్రికి ఏలూరులోనే బస్సు యాత్ర బృందం బస చేస్తారని తెలిపారు. తిరిగి 8వ తేదీ బుధవారం ఉదయం ఏలూరులో ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన టిడ్కో ఇళ్లను బృందం పరిశీలిస్తుందన్నారు. కాబట్టి మంగళవారం సాయంత్రం జరిగే ర్యాలీ, బహిరంగ సభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, వివివిఎన్.ప్రసాద్, జి.రవి కిషోర్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి రాష్ట్ర బస్సు యాత్రను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, పట్టణ కన్వీనర్ పి.సూర్యారావులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ నవంబర్ 7వ తేదీ మంగళవారం ఉదయం జంగారెడ్డిగూడెం పట్టణంలోకి ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర చేరుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎ.ప్రభాకర్ రావు, ఎస్‌కె.సుభాషిణి పాల్గొన్నారు.

బియ్యం ధరల నియంత్రణపై చర్యలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

బియ్యం ధరల నియంత్రణపై అధికారులు చర్యలు చేపట్టాలని ఆగిరిపల్లి మండల సిపిఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆగిరిపల్లి తహాశీల్దార్ కార్యాల అధికారికి సోమవారం స్పందనలో వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జహంగీర్ భాషా, సుభానీ, వెంకటేశ్వరరావు, గోపాలరావు, ఊళక్కయ్యలు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

61 మంది విద్యార్థుల రక్తదానం

ఏలూరు అర్బన్ : స్థానిక సర్ సిఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 61 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించగలిగేలా విద్యార్థి దశ నుంచి అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెవి.విష్ణు మోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, పీజీ కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, ఎన్‌సిసి ఆఫీసర్ నవీన్ పాల్గొన్నారు.

వైసిపి అరాచక పాలనకు చరమగీతం : టిడిపి

టి.నరసాపురం : రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు చమరగీతం పాడాలని టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని అప్పలరాజు గూడెంలో సోమవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.15 వందలు, తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు రూ.15 వేలు, దీపం పథకం ద్వారా ఉచితంగా 3 గ్యాస్ సిలీండర్లు, అన్నదాతలకు ఏడాదికి రూ.20 వేలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, ఆచంట సూర్యనారాయణ, గన్నిన సురేంద్ర నాథ్ చౌదరి, వాసిరెడ్డి మోహన్‌రావు, సందేపూడి సాయి, చిలకా బాలయ్య, మోదుగు రామారావు పాల్గొన్నారు.

8న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి : వైసిపి

టి.నరసాపురం : ఈనెల 8న మండలంలో జరిగే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు(సూరిబాబు) పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గ పరిధిలో ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200ల రోజులు పూర్తైన సందర్భంగా ఈనెల 8న మండలంలోని బొర్రంపాలెం అడ్డరోడ్డు నుంచి టి.నరసాపురం వరకు భారీ సంఖ్యలో బైక్ ర్యాలీ, అనంతరం టి.నరసాపురంలో బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఎస్‌విపికెహెచ్.శ్రీను రాజు, కె.జగ్గవరం పిఎసిఎస్ అధ్యక్షులు వాసిరెడ్డి మధు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ నిరసన

జంగారెడ్డిగూడెం : న్యాయవాదిపై జరిగిన దాడిపై పోలీసులు సరిగ్గా స్పందించకపోవడం, సెక్షన్స్ నమోదు చెయ్యకపోవడం విచారకరమని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు అచ్యుత శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది బాషా శ్యాంబాబుపై దాడిని ఖండిస్తూ జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి, నల్ల బేడ్జీలతో కోర్టు ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎవివి.భువనేశ్వరి, తల్లాడి అశోక్ కుమార్, లలితకుమారి పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి చేపట్టిన ఆందోళన ఈనెల 8వ తేదీకి 1000 రోజులు కావస్తున్న సందర్భంగా 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తోర్లపాటి రాజు పిలుపునిచ్చారు. పట్టణంలో విద్యాసంస్థల బంద్ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది విద్యార్థి యువజన ప్రాణత్యాగాల ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గత వెయ్యి రోజులుగా ఉద్యమం నిర్వహిస్తుంటే కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి రాష్ట్రంలో మద్దతు తెలుపుతూ ఢిల్లీ వెళ్లేసరికి అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండు కూడా కేంద్ర ప్రభుత్వ విధానాలను సమర్థిస్తూ ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కుని, సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రయివేటుపరం కానివ్వమని హెచ్చరించారు. ఈనెల 8వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగే విద్యాసంస్థల బంద్‌లో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ బంద్ పోస్టర్ ఆవిష్కరణలో ఎఐవైఎఫ్ నాయకులు బొల్లవరపు విజయ్ శేఖర్, ఎఐఎస్ఎఫ్ నాయకులు అవినాష్ పాల్గొన్నారు.

శ్మశానంలో ముళ్లకంపలను తొలగించాలి

'స్పందన'లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అర్జీ

ప్రజాశక్తి - మండవల్లి

ఎస్‌సి స్మశానంలో పెరిగిన ముళ్లకంపలను తొలగించి, స్మశానానికి వెళ్లే నడకదారిని పునరుద్ధరించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ముళ్లపొదల ఆక్రమణ తొలగించాలని, నడకదారిని పునరుద్ధరించాలని కోరుతూ ఆయన అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశానంలో ముళ్ల మొక్కలు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగిపోయాయన్నారు. అంతేకాకుండా స్మశానంలో వెళ్లేందుకు దారి కూడా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలియజేశారు. కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి స్మశానాలు ఆక్రమణకు గురికాకుండా ఉండేవిధంగా స్మశానాలు లేని గ్రామాల్లో స్మశానంను ఏర్పాటు చేసేలా 2008లో అక్టోబర్ 25న జీఎ ఎంఎస్ నెంబర్ 1235 విడుదల చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఖననం చేయడానికి వెళ్లే క్రమంలో ఎస్‌సిలు పడుతున్న ఇబ్బందులపై సంవత్సరాల తరబడి గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చినా నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ఆక్రమణలు తొలగించి, సరిహద్దులు నిర్ణయించి, ప్రహరీ గేటు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అనంతరం తహాశీల్దార్ కె.రవికుమార్‌కు అర్జీ సమర్పించారు.

స్మశానంలో దట్టంగా పెరిగిపోయిన ముళ్ల కంపలు

అనధికారికంగా విక్రయిస్తే చర్యలు

బాణసంచా అమ్మకందారులకు సూచనలు

పోలవరం : అనధికారంగా బాణసంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పోలవరం తహాశీల్దార్ బి.సుమతి హెచ్చరించారు. సోమవారం మండలంలోని స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ అధ్యక్షతన బాణసంచా అమ్మకాలు జరిపేవారికి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ రానున్న దీపావళి పండుగ సందర్భంగా మండలంలో బాణసంచా అమ్మకాలు జరిపేవారు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీపావళి సామగ్రి అమ్మేవారు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలని, అమ్మే ప్రదేశాలలో నీరు, ఇసుక, ఫస్ట్ ఎయిడ్ సామగ్రి అందుబాటులో ఉండాలని, అందరికీ కనిపించేలా ధరలు పట్టిక ఉంచాలని తెలిపారు. అమ్మే ప్రదేశాల చుట్టుపక్కల మంటలు గానీ, చుట్ట, బీడీ, సిగరెట్టు, ఇతర మండే వస్తువులు ఏవీ ఉండకుండా షాప్ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్తీకమాసం సందర్భంగా పుణ్య స్థానాలు చేసే భక్తులకు అనువుగా ఉండే విధంగా స్నానాల ఘాట్లను ఏర్పాటు చేసి, అనధికార రేవుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. పట్టిసీమ శివ క్షేత్రానికి వెళ్లే భక్తులకు నది దాటే సమయంలో ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనధికారికంగా బాణసంచా విక్రయించే వారిని గుర్తించి సమాచారం ఇవ్వాలని విఆర్ఒలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, ఎఎస్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా పల్లగాని

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నవ్యాంధ్ర జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా చొప్పరమెట్ల తాడేపల్లికి చెందిన పల్లగాని కోటేశ్వరరావు నియమితులయ్యారు. నవ్యాంధ్ర జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం సోమవారం విజయవాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నవ్యాంధ్ర జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్‌కె.జలీల్ హాజరై నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగువార్త దినపత్రిక ఎపి స్టేట్ బ్యూరో మల్లాది ప్రసాదరావు, నవ్యాంధ్ర జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు వీరేంద్ర, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

'జనం మనస్సుల్లో చెరగని ముద్ర'

ప్రజా సంకల్ప పాదయాత్రకు ఆరేళ్లు..

ప్రజాశక్తి - చింతలపూడి

జనం మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంటూ, నేటి ప్రజారంజక పాలనకు ఊపిరి పోసిన 'జగనన్న పాదయాత్ర' నేటికి ఆరెళ్లు పూర్తైందని చింతలపూడి నగర పంచాయతీ సచివాలయ కన్వీనర్ నిమ్మగడ్డ దుర్గారావు తెలిపారు. నగరపంచాయతీ వైసిపి అధ్యక్షులు కొప్పుల నాగు ఆధ్వర్యంలో ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు పూరైన సందర్భంగా వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3,648 కిలోమీటర్లు, 2,516 గ్రామాలు, 341 రోజులు, 134 నియోజకవర్గాలు, 124 బహిరంగ సభలు, 55 ఆత్మీయ సమావేశాలు నిర్వహించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆత్కూరి సుబ్బారావు, గంధం చంటి, శ్రీహరి రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి : ముఖ్యమంత్రి జగన్ చేసిన పాదయాత్ర నేటికి ఆరేళ్లు పూరైన సందర్భంగా వైసిపి నాయకులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక చాట్రాయి సెంటర్‌లో రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి కేక్ కట్ చేసి స్వీట్స్ పంచి పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టక ముందు ప్రజల పరిస్థితిని తెలుసుకోవడం కోసం ప్రారంభించిన పాదయాత్ర నేటికి ఆరు సంవత్సరాలు పూరైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, ఆరుగొలను పేట సర్పంచి పుచ్చకాయల అప్పిరెడ్డి, కోటపాడు ఎంపిటిసి సభ్యురాలు చెలికాని ఉషారాణి, చీపురుగూడెం ఎంపిటిసి సభ్యురాలు మొరంపూడి స్వరూపారాణి, పోలవరం సొసైటీ అధ్యక్షులు చెలికాని బాబ్జి పాల్గొన్నారు.

ముసునూరు : ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల బాధలు తెలుసుకుని వారికి బాధలు లేకుండా చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని మండల వైసిపి అధ్యక్షులు మూల్పూరి నాగ మల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం మండలంలోని చింతలవల్లి గ్రామంలో ముఖ్య అతిథులు జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కోటగిరి రాజానాయనల ఆధ్వర్యంలో ప్రజా సంకల్ప యాత్ర ఆరు సంవత్సరాలు పూరైన సందర్భంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పిల్లి సత్యనారాయణ, పేరం కృష్ణ, కంచర్ల వాణి, చలసాని దామోదరరావు, నక్కనబోయిన సత్యనారాయణ, వైస్ ఎంపిపి పాములు గంగాధర్ రావు, కంబాల రాంబాబు, కంబాల దాసు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఇచ్చిన హామీలను 95 శాతానికి పైగా అమలు చేసి వైసిపి రాజకీయంగా ముందంజలో ఉందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. సోమవారం వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో సిఎం జగన్ ప్రారంభించిన ప్రజా సంకల్ప యాత్ర ఆరు సంవత్సరాలు పూరైన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పామర్ వైసిపి సీనియర్ నాయకులు విద్యాసాగర్, మండవల్లి సోంబాబు పాల్గొన్నారు.

ముసునూరులో కేక్ కట్ చేస్తున్న వైసిపి నేతలు

శ్రీవారి హుండీ లెక్కింపు

ఆదాయం రూ.2,99,75,448

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలు సోమవారం ఉదయం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడచిన 32 రోజులకు గాను రూ.2,99,75,448 ఆదాయం వచ్చింది. అలానే భక్తుల కానుకల రూపేణా 388 గ్రాముల బంగారం, 10 కేజీల 056 గ్రాముల వెండి, రూ.500(34 నోట్లు), రూ.1000(2 నోట్లు), రూ.2,000(25 నోట్లు), పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాథరావు తెలిపారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: -1st ఫ్లోర్, జెట్ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మీథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట, కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకట్ ప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్, అక్షరానంద స్కూల్ ఎదురు, ద్వారకాతిరుమల-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, బిమార్ట్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-11-2023 ఉ. 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2200.10 గ్రాముల వస్తువులు కుదువపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
ELURU AREA CELL NO- 8074656196

డాక్యుమెంట్లు పోయినవి
పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు మండలం, తణుకు, పాతవూరుకి చెందిన నకెళ్ళ మురళీ కిషోర్‌కుమార్, తండ్రి: నకెళ్ళ కనకరాజు అను నేను మా నాన్న గారు అయిన నకెళ్ళ కనకరాజు ఇంటి ఒరిజినల్ రిజిస్ట్రర్డ్ దాక్యుమెంటు నెం. 1999/1982 గల దాక్యుమెంటు ది.26-10-2023వ తేదీన తణుకు నుండి రాజమండ్రి వెళ్ళుతుండగా తణుకు కేశవ స్వామి గుడి సమీపమున ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్సు పడిపోయినవి. ఎంత వెదకినా డాక్యుమెంట్సు దొరికలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకి తెలియజేయగలరు.
నకెళ్ళ మురళీ కిషోర్ కుమార్
తండ్రి: కనకరాజు, డో.నెం. 4-2-17/1,
పాతవూరు, తణుకు, ప॥గో॥జిల్లా.
సెల్: 93818 38609

In the Court of the Hon'ble Addl. Senior Civil Judge, Eluru, W.G.Dist.,
I.A. No. /2023 in
I.P. No. 2/2023
Between:
Donka Venkateswara Rao ...Petitioner
Terrala Nageswara Rao & Others ...Respondents
To:
R-6: పై నంబరు గ్రంథంలో
Balla Tulasi N Baga Pulla Rao, S/o. Dasu, R/o. 9th Division, Ramalayam Veedi, DSP gari Road, Eastren ...... The Official Receiver, W.G.Dist., Eluru
అను వారికి నోటీసులు అమలు కొరకు ది. 28-11-2023 ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల తమ పరోక్షమున సంగతులు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జుజ్జవరపు ప్రసాద్
అడ్వకేట్, ఏలూరు
సెల్: 90002 66396

మహారాజశ్రీ ఏలూరు Motor Accidents Claims Tribunal (I Addl. Dist. Judge) Eluru, W.G.Dist.,
M.V.O.P.No. 183/2023
Between:
Saiyala Venkata Ramana & Others ...Petitioners
AND
Allapureddy Ramesh Reddy & Others ...Respondents
TO:1st Respondent: Allapureddy Ramesh Reddy, S/o. Somireddi, Driver of Eicher Van No. AP 39 TG 1444, D.No. 2/63, Main Road, Bodagani Doddi, Bukkaraya Samudram, Ananthapuram Dist.,
TO: 2nd Respondent: Anke Bhavani, W/o. Siva Sankar, Owner of Eicher Van No. AP 39 TG 1444, D.No.1-258, Reddypalli, Bukkaraya Samudram, Ananthapuram Dist.,
పై నెంబరు 1వ రెస్పాండెంటు, 2వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు నోటీసు పంపినా అమలు జరగనందున ఈ పబ్లికేషన్ ద్వారా కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున ది.09-11-2023 మీరు గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట స్వయంగా హాజరై సమాధానం తెలుపుకొనగలరు. అట్లు జరగని ఎడల మీ పరోక్షమున తీర్మానం జరుపబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఏలూరు, గాడిలి ఉగ్రనరశింహారావు
8-9-23. పిటీషనరు తరుపు అడ్వకేట్

S.R.K.R. ENGINEERING COLLEGE (AUTONOMOUS)
Accredited by AICTE, New Delhi and Affiliated to JNTUK, Kakinada, NAAC with 'A' Grade, CHINNA AMIRAM (PO) :: BHIMAVARAM, W.G.Dt.
☎ 98488 23332
ADMISSION NOTIFICATION FOR M. TECH (CATEGORY-B ADMISSION: 2023-2024)
Candidates seeking admission into M. Tech Courses under Category-B admission for the academic year 2023-24, shall contact college office along with original certificates on or before 09-11-2023, 5.00 PM.
The admissions will be made as per guidelines from APSCHE
Principal